ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
బుధవారం, 28 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 64 | పేజీలు: 4 వెల: 5

## బల్దియాలో హార్టికల్చర్ మతలబు!



- రూ.47.75 లక్షల మొక్కల కొనుగోళ్లపై అనుమానాలు
- 267 పనులు.. టెండర్లు మాత్రం ముప్పై రెండే
- మిగిలిన 235 పనుల చెల్లింపులపై సందేహాలు
- ఆర్టీఐ దరఖాస్తుకూ బిల్లులు, ఒప్పందాల ప్రతులు ఇవ్వని అధికారులు
- 23 మంది శాశ్వత సిబ్బందికి 164 మంది ఔట్‌సోర్సింగ్
- ఆడిట్ జరిగిందంటూ నివేదికలు వెల్లడించకుండా నాటకీయత

3

## సార్ ఎక్కడ..?!

- వరంగల్ ఈఎస్ఐ ఆస్పత్రిలో పర్యవేక్షణ గాలికి
- సూపరింటెండెంట్ సార్ వారానికోసారి ఆస్పత్రికి
- అదనంగా మూడు బాధ్యతల్లో సార్ తలమునకలు
- ఆస్పత్రిలో వైద్యసేవలు నిల్.. అత్యవసర సేవలకు వస్తే అంతే గతి
- నెలలుగా నిలిచిన అత్యవసర చికిత్సలు
- మధ్యాహ్నం తర్వాత ఆస్పత్రంతా ఖాళీ..కానరాని వైద్యులు
- మొత్తం నర్సింగ్ స్టాఫ్‌పైనే భారమంతా.. రాత్రి వేళల్లో ఒకరిద్దరుతోనే ఆస్పత్రి నిర్వహణ
- అది కూడా జ్వరం గోళీలకే పరిమితమవుతున్న వైద్యం
- ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని కార్మిక కుటుంబాల ఆవేదన
- రోజుకు 100 మందికి ఔట్ పేషట్లు వస్తున్నా మెరుగుపడని వైద్య సేవలు
- కొత్త యంత్రాలున్నా పూర్తిస్థాయి వైద్యం అందడం లేదంటూ ఆవేదన
- నాలుగు ఉమ్మడి జిల్లాల కార్మికులకు తప్పని అవస్థలు

కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద దిక్కుగా ఉండాల్సిన వరంగల్ ఈఎస్ఐ ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్య సేవలు నామమాత్రంగా మారుతున్నాయి. వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో పాటు ఆస్పత్రి పర్యవేక్షణ కొరవడుతోంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ కాంతిసాగర్ రాష్ట్ర స్థాయిలో రెండు అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వరంగల్ ఆస్పత్రిలో వైద్యులపై పర్యవేక్షణ లేకుండా పోతోందన్న ఆరోపణలున్నాయి. సర్జికల్ వస్తువుల కొరత, రోగులకు ఆహార సరఫరాలో సమస్యలు, వైద్యుల విధుల సమయపాలనపై ఫిర్యాదులు ఆస్పత్రి పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. కొత్త ఎక్స్‌రే, ఈసీజీ యంత్రాలు ఉన్నప్పటికీ తమకు అవసరమైన వైద్యం సకాలంలో అందడం లేదని రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. - కాకతీయ,వరంగల్

3




## కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలి!

- ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రాణహిత జలాలను వినియోగించుకోవాలి
- నీటి మట్టం సరిపోకుంటే నెలలో కాఫర్ డ్యాం నిర్మించాలి
- రైతులను పంటలు వేయొద్దనడం మూర్ఖపు ఆలోచన
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి




**కాకతీయ, హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీటిని ఎత్తిపోయేందుకు తగిన నీటిమట్టం లేకుంటే నెల రోజుల్లో కాఫర్ డ్యాం నిర్మించి నీటిని వినియోగించుకోవచ్చని సూచించారు. రోజుకు ఒక టీఎంసీ చొప్పున ఎత్తిపోసినా ఐదు నెలల్లో 150 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు వద్ద ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసి నింపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ, కన్నెపల్లి వద్ద కూడా అలాంటి చర్యలు చేపట్టవచ్చన్నారు. వృథాగా పోతున్న ప్రాణహిత జలాలను తాగునీరు, సాగునీరు, విద్యుదుత్పత్తికి ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కరువు సమయంలో రైతులకు అండగా నిలుస్తుందని అన్నారు.

**రైతుల నుంచి స్వీయ ప్రకటనలా?**

వరి విత్తనాలు కొనుగోలు చేసే రైతుల నుంచి నీరు, విద్యుత్ అడగబోమంటూ స్వీయ ప్రకటనలు తీసుకోవడం మూర్ఖపు ఆలోచన అని జీవన్‌రెడ్డి విమర్శించారు. రైతులు పంటలు పండించకపోతే దాని ప్రభావం అందరిపైనా పడుతుందని, ఇప్పటికే బియ్యం ధరలు పెరిగాయని తెలిపారు. ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి రైతులను పంటలు వేయొద్దని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 30 నెలలుగా నిద్రపోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు మహారాష్ట్ర వెళ్లి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు గురించి మాట్లాడారని జీవన్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ హయాంలో తుమ్మిడిహెట్టి కోసం ఎన్నో ప్రయత్నాలు జరిగాయని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టుల

........(తరువాయి 2లో)




# చచ్చిపోతేనే బిల్లులొస్తాయా?

## సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌ను రూ.లక్ష కోట్ల అప్పుల్లో ముంచారు

- 16 నెలలుగా మూలుగుతున్న రూ.600 కోట్ల దొడ్డు బియ్యం
- 17,200 మంది డీలర్లకు నెలకు రూ.10 కోట్లు ఇవ్వలేరా?
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు

**కాకతీయ,తెలంగాణ బ్యూరో / గజ్వేల్ :** కాంగ్రెస్ పాలనలో చచ్చిపోతేనే పనులు అవుతాయా.. ప్రాణ త్యాగానికి సిద్ధమైతేనే బిల్లులు వస్తాయా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లోని బింగి ఎల్లయ్య గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త రేషన్ డీలర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు సమస్యల పరిష్కారం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమని ప్రకటించడం తనను కలచివేసిందన్నారు. జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సైతం బిల్లుల కోసం చనిపోవడానికైనా సిద్ధమని ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. ఎవరూ ప్రాణాలు తీసుకోవద్దని, అందరూ కలిసికట్టుగా పోరాడి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

**మేనిఫెస్టో హామీలు ఏమయ్యాయి?**

రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన రేషన్ డీలర్లు మూడేళ్లుగా తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల సమయంలో ఒక్కో డీలర్‌కు నెలకు రూ.5,000 గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్, రేషన్ దుకాణాలను మినీ సూపర్ మార్కెట్లుగా మార్చుకునే అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ హామీలను నమ్మి డీలర్లు కాంగ్రెస్‌కు మద్దతుగా పనిచేశారని, ఇప్పుడు కొత్త డిమాండ్లు కాకుండా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే అమలు చేయాలని అడుగుతున్నారని పేర్కొన్నారు. 17,200 మంది డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డీలర్ల కమిషన్‌ను క్వింటాలుకు రూ.140కు పెంచిన విషయాన్ని ప్రస్తావించారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం రూ.300 కమిషన్ ఇవ్వాలని చెప్పారని గుర్తుచేశారు.

........(తరువాయి 2లో)

## నవంబర్ 2న బీజేపీ మహా పాదయాత్ర

- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొడతాం
- ట్యాంక్‌బండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు యాత్ర
- సాయంత్రం 4 గంటలకు ప్రారంభం
- ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా



2

## కార్మికుల బీమా చెల్లింపుల్లో కుంభకోణం!

- రూ.346 కోట్ల నిధులపై విచారణ జరపాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్



2

## పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య

- నెల్లికుదురులో రూ.7.50 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- రాష్ట్రంలో తొలి పాఠశాలకు ఇక్కడే శంకుస్థాపన
- 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఒకే ప్రాంగణంలో విద్య
- అభివృద్ధిలో బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం
- రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి



2

# ఎస్ఐఆర్‌పై ఈసీ అఫిడవిట్

## పిటిషనర్లకు 10 రోజుల గడువు!

- ఓటర్ల జాబితాల సవరణ చట్టబద్ధమేనన్న ఎన్నికల సంఘం
- ఫారం6లో మార్పులపై మరో పిటిషన్.. ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు
- ముగ్గురు ఎన్నికల కమిషనర్లదీ ఏకగ్రీవ నిర్ణయం మేనని అఫిడవిట్‌లో వెల్లడి

**కాకతీయ, నేషనల్ డెస్క్ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు సుప్రీంకోర్టు పది రోజుల గడువు ఇచ్చింది. ఎస్ఐఆర్ ప్రక్రియ చట్ట నిబంధనలకు అనుగుణంగానే చేపట్టామని, దీనికి సంబంధించిన నిర్ణయాలను ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులూ ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన అఫిడవిట్‌లో పేర్కొంది. మరోవైపు, బిహార్‌లో ఎస్ఐఆర్ సందర్భంగా ఓటరు నమోదు కోసం ఉపయోగించే ఫారం 6లో సుప్రీంకోర్టు అనుమతి లేకుండానే మార్పులు చేశారన్న ఆరోపణలపై దాఖలైన మరో పిటిషన్‌పై కూడా ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వీ మోహనతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికల సంఘం సోమవారం రాత్రి దాఖలు చేసిన అఫిడవిట్‌పై పది రోజుల్లోగా ప్రత్యుత్తర అఫిడవిట్ సమర్పించాలని తొలి పిటిషనర్ రాకేశ్ కుమార్ సింగ్ తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారానికి

........(తరువాయి 2లో)





## తెలంగాణకు భారీ వర్ష సూచన

- నాలుగు జిల్లాలకు అతి భారీ వర్షా ల హెచ్చరిక
- ఈశాన్య తెలంగాణలో గంటకు 60 కి.మీ. వేగంతో గాలులు
- వరంగల్, హనుమకొండలో ఓ మోస్తరు వర్షా లు
- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపులు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అంచనాలు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్,

........(తరువాయి 2లో)

# చచ్చిపోతేనే బిల్లులొస్తాయా?

(మొదటిపేజీ తరువాయి)

నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, పన్నులు, అధికారుల వేధింపులతో డీలర్లు కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

**రూ.600 కోట్ల బియ్యం వృథా**

సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన తర్వాత పాత దొడ్డు బియ్యం నిల్వలను పట్టించుకోకపోవడంతో గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్ దుకాణాల్లో భారీగా బియ్యం పేరుకుపోయిందని హరీశ్‌రావు ఆరోపించారు. సుమారు 16 నెలలుగా లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం గోదాముల్లో, మరో 40 వేల నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ దుకాణాల్లో నిల్వ ఉండిపోయాయని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.600 కోట్లు ఉంటుందని, పురుగులు, ఎలుకల వల్ల



బియ్యం పాడైపోతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఆ బియ్యాన్ని ముందుగానే వేలం వేసి ఉంటే వచ్చిన ఆదాయంతో డీలర్లకు గౌరవ వేతనం, కమిషన్ చెల్లించవచ్చని అన్నారు. పాడైన బియ్యం నిల్వల్లో తరుగును కూడా డీలర్లే భరించాలని ఒత్తిడి చేయడం అన్యాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల పౌరసరఫరాల కార్పొరేషన్ దాదాపు రూ.లక్ష కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. సన్నబియ్యం పంపిణీ, సన్నవడ్ల బోనస్, గ్యాస్ సబ్సిడీకి సంబంధించిన నిధులను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయడం లేదని అన్నారు.

**హామీలు నెరవేర్చకపోతే అసెంబ్లీలో నిలదీస్తాం**

మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ, రోడ్ల నిర్మాణం, కొత్త క్యాంపు కార్యాలయం వంటి వాటికి భారీగా నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం డీలర్లకు నెలకు రూ.10 కోట్లు కేటాయించలేదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయ నిర్మాణానికి రూ.100 కోట్లు, ప్రహరీ గోడకు రూ.18 కోట్లు ఖర్చు చేసినట్లు ఆరోపిస్తూ, పేదలకు రేషన్ అందించే డీలర్ల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే డీలర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గాన్ని చర్చలకు పిలిచి, గౌరవ వేతనం, కమిషన్, మినీ సూపర్ మార్కెట్ల హామీలను అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ, శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, ధరావత్ మోహన్ నాయక్, అజీజ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై ఈసీ అఫిడవిట్

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు.

**ఫారం-6లో మార్పులపై వివాదం**

బిహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా ఓటరు నమోదుకు ఉపయోగించే ఫారం 6లో మార్పులు చేశారంటూ రాజ్యసభ సభ్యురాలు దోలా సేన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆమె తరఫున సీనియర్ న్యాయవాది, ఎంపీ మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు. ఫారం 6లో చేసిన మార్పులకు సుప్రీంకోర్టు ఆమోదం ఉందని ఎన్నికల సంఘం తప్పుగా పేర్కొంటోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై ఎన్నికల సంఘం, ఇతర సంబంధిత పక్షాలకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఫారం 6లో ఎలాంటి మార్పులూ చేయలేదని ఎన్నికల సంఘం తన 248 పేజీల అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే చట్టబద్ధమైన ఫారంలో మార్పులు చేశారన్న ఆరోపణలను తోసిపుచ్చింది. ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం విచారకరమని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఫారం



6కు సంబంధించిన వివాదంపై సుప్రీంకోర్టు విచారణ ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఏకగ్రీవ నిర్ణయాలేనన్న ఈసీ**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈసీ తన వైఖరిని వెల్లడించింది. ఎస్ఐఆర్ నిర్వహణకు చట్టపరమైన అధికారం ఉందని, సంబంధిత ఉత్తర్వులకు ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని అఫిడవిట్‌లో పేర్కొంది. ఈ అఫిడవిట్‌ను కోర్టులో దాఖలు చేయడానికి కూడా ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు వెల్లడించింది. ఉప ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ యేతురు తరఫున ఈ సమాధానాన్ని దాఖలు చేశారు. గత పది నెలల్లో ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఉత్తర్వులపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారని ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 25న ప్రచురించిన కథనం పేర్కొంది. కొన్ని నిర్ణయాలు తమకు తెలియకుండా లేదా తమ సిఫార్సులు లేకుండానే జారీ అయ్యాయని వారు అభ్యంతరం తెలిపినట్లు ఆ కథనం వెల్లడించింది. ఈ కథనం అనంతరం ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్ష పార్టీలు నిరసనలు చేపట్టాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కూడా డిమాండ్లు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ చట్టబద్ధత, ఫారం 6లో మార్పులపై వివాదం సుప్రీంకోర్టు విచారణలో కీలకంగా మారింది.

# కార్మికుల బీమా చెల్లింపుల్లో కుంభకోణం!

- రూ.346 కోట్ల నిధులపై విచారణ జరపాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్

**కాకతీయ, హైదరాబాద్ :** తెలంగాణ కార్మిక శాఖలో బీమా చెల్లింపులకు సంబంధించిన లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థకు అక్టోబర్ 27న ఫిర్యాదు లేఖ రాశారు. ట్రయల్ బ్లెజర్ సంస్థ రిజిస్ట్రేషన్‌ను తాత్కాలికంగా నిలిపివేసి, ఆ సంస్థకు కమీషన్లు, పారితోషికాలు చెల్లించకుండా ఆదేశించాలని కోరారు. జూన్ 2025 నుంచి చెల్లించిన క్లెయిమ్‌లన్నింటినీ ఆడిట్ చేయాలని, ముఖ్యంగా పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, సూర్యాపేట జిల్లాల చెల్లింపులను పరిశీలించాలని సూచించారు. రూ.346 కోట్ల నిధుల స్వీకరణ, నిర్వహణ, సంస్థ నియామక ప్రక్రియ, అర్హతలు, క్లెయిమ్‌ల చెల్లింపులో పాత్రపై విచారణ జరపాలని కోరారు. క్రెడిట్ యాక్సెస్ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థల రికార్డులనూ పరిశీలించాలని పేర్కొన్నారు. ప్రీమియం ధరలపై ఫోరెన్సిక్, యాక్చువేరియల్ ఆడిట్లు నిర్వహించాలని, జూన్ 2026 తర్వాత కూడా కార్మికులకు బీమా అమలవుతోందో లేదో తేల్చాలని కోరారు. అక్రమాలు నిర్ధారణైతే రిజిస్ట్రేషన్ రద్దు, జరిమానాలతో పాటు పోలీసు కేసులు నమోదు చేసి ఈడీ, ఏసీబీ, సీబీఐ దర్యాప్తునకు సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుపై 30 రోజుల్లో చర్యలు తీసుకోవాలని కోరారు.

# నవంబర్ 2న బీజేపీ మహా పాదయాత్ర

- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొడతాం
- ట్యాంక్‌బండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు యాత్ర
- సాయంత్రం 4 గంటలకు ప్రారంభం
- ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**కాకతీయ, హైదరాబాద్ :** ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర సవరణ)పై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నవంబర్ 2న హైదరాబాద్‌లో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు బీజేపీ ప్రకటించింది. ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకవాదాన్ని అంతం చేద్దాం అనే నినాదంతో జరిగే ఈ యాత్రకు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు ట్యాంక్‌బండ్‌పై స్వామి వివేకానంద విగ్రహం వద్ద యాత్ర ప్రారంభమై, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగనుంది. దేశ సమగ్రత, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై కాంగ్రెస్, ఇండీ కూటమి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అశాంతిని ప్రేరేపిస్తున్నాయని బీజేపీ విమర్శించింది. రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టి వాస్తవాలను ప్రజలకు వివరించడమే యాత్ర ఉద్దేశమని పేర్కొంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్షనేత ఏవీఎన్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ తమిళనాడు కోఇన్‌చార్జి డీకే అరుణ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కర్ణాటక కోఇన్‌చార్జి డా. కాసం వెంకటేశ్వర్లు, పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పాల్గొననున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ శ్రేణులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, జాతీయవాదులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి మహా పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ కార్యాలయ కార్యదర్శి పిలుపునిచ్చారు.

# వరంగల్ టూరిజం సర్క్యూట్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు!

- 'ది వీక్ హెరిటేజ్ అవార్డ్స్ – 2026'లో సిల్వర్ బన్యన్ పురస్కారం
- వారసత్వ పర్యాటక విభాగంలో వరంగల్, హనుమకొండ, ములుగు సర్క్యూట్‌కు గౌరవం



**కాకతీయ, వరంగల్:** తెలంగాణ పర్యాటక రంగానికి మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. వరంగల్, హనుమకొండ, ములుగు పర్యాటక సర్క్యూట్‌కు 'ది వీక్ హెరిటేజ్ అవార్డ్స్-2026'లో వారసత్వ పర్యాటక విభాగంలో సిల్వర్ బన్యన్ అవార్డు దక్కింది. న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి మ్యూజియం అండ్ లైబ్రరీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కాకతీయుల చారిత్రక వైభవం, ప్రాచీన దేవాలయాలు, ప్రకృతి అందాలు, గిరిజన సంస్కృతి, చేనేత సంప్రదాయాలను ఒకే పర్యాటక మార్గంలో అనుసంధానించినందుకు ఈ గుర్తింపు లభించింది. వరంగల్ కోట, కాకతీయ కళాతోరణం, వేయి స్తంభాల గుడి, భద్రకాళి దేవాలయంతో పాటు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం ఈ సర్క్యూట్‌లో ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తున్నాయి. లక్నవరం సరస్సు, సస్పెన్షన్ బ్రిడ్జి, బొగత జలపాతం పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తున్నాయి. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి మార్గదర్శకత్వంలో పర్యాటక సదుపాయాల అభివృద్ధి, హరిత హోటళ్లు, రిసార్టులు, బోటింగ్, ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలపై దృష్టి సారిస్తున్నారు. 'తెలంగాణ జారూర్ ఆనా' ప్రచారం ద్వారా ఈ ప్రాంత విశిష్టతను దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు పరిచయం చేస్తున్నారు. ఈ అవార్డు తెలంగాణ వారసత్వ సంపదకు మరింత గుర్తింపు తీసుకురానుంది.

# పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య

- నెల్లికుదురులో రూ.7.50 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- రాష్ట్రంలో తొలి పాఠశాలకు ఇక్కడే శంకుస్థాపన
- 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఒకే ప్రాంగణంలో విద్య
- అభివృద్ధిలో బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం
- : రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి



**కాకతీయ, నెల్లికుదురు :** పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో రూ.7.50 కోట్లతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి మంగళవారం ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం మంజూరు చేసిన 122 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో మొదటి పాఠశాలకు నెల్లికుదురులో శంకుస్థాపన చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యను ఒకే ప్రాంగణంలో అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వేం నరేందర్‌రెడ్డి తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి మోడల్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేసి సుమారు 6,000 మంది విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. నెల్లికుదురులో నిర్మించనున్న పాఠశాలలో ప్రీప్రైమరీ బ్లాక్, డిజిటల్ తరగతి గదులు, ఆధునిక భోజనశాల, రన్నింగ్ ట్రాక్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ వివరించారు.

**నెల్లికుదురు అభివృద్ధికి నిధులు**

స్థానిక ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ మాట్లాడుతూ నెల్లికుదురు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందన్నారు. చారిత్రక రంగస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.1 కోటి మంజూరైనట్లు తెలిపారు. పాత గెస్ట్‌హౌస్ స్థానంలో జి ప్లస్ వన్ భవనంతోపాటు 20 దుకాణాలు నిర్మించనున్నట్లు చెప్పారు. 1.2 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి, డివైడర్, సెంట్రల్ లైటింగ్, అంబేద్కర్ కూడలి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ జిల్లాలో మెడికల్ కాలేజీ, జేఎన్‌టీయూ, పాలిటెక్నిక్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల్లో సుమారు రూ.800 కోట్ల నుంచి రూ.1,000 కోట్ల వరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. రైతులు ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలు సాగు చేయాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని వేం నరేందర్‌రెడ్డి సూచించారు. నెల్లికుదురులో 30 పడకల ఆస్పత్రి, ఆధునిక బస్టాండ్, రహదారుల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, స్థానిక సర్పంచ్ పులి వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, కాంగ్రెస్ నాయకులు భరత్ చందర్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కన్నేపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలి!

(మొదటిపేజీ తరువాయి)

మరమ్మతులు కూడా చేపట్టలేదని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు గ్రావిటీ ద్వారా నీటిని తీసుకొస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా నాన్చుడు ధోరణి వీడి రైతుల ప్రయోజనాల కోసం కన్నేపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. పాలన చేయడం చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకుని గవర్నర్‌కు బాధ్యతలు అప్పగించాలని వ్యాఖ్యానించారు. ఈ మీడియా సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె. విప్లవ్‌కుమార్ పాల్గొన్నారు.

# తెలంగాణకు భారీ వర్ష సూచన

(మొదటిపేజీ తరువాయి)

ములుగు జిల్లాలకు అతి భారీ వర్షాల హెచ్చరిక జారీ చేసినట్లు సమాచారం. ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలున్నాయి. వరంగల్, హనుమకొండ జిల్లాల్లోనూ ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వాతావరణ శాఖ బులెటిన్ ప్రకారం, తుపాను బుధవారం (అక్టోబర్ 28) ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అంచనా. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచి, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవచ్చని పేర్కొన్నట్లు సమాచారం. తుపాను ప్రభావంతో తెలంగాణలోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరికలు వెలువడ్డాయి. మరోవైపు, జలాశయాల్లో తగ్గిన నీటి నిల్వలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, సాగునీటి వనరుల్లో నీటి మట్టాలు తగ్గడం వ్యవసాయంపై ప్రభావం చూపుతోంది. సాధారణంగా ఈ సమయానికి 400 టీఎంసీలకు పైగా నీటి నిల్వలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం సుమారు 200 టీఎంసీలే ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తుపాను వర్షాలతో జలాశయాల్లోకి నీరు చేరి సాగునీటి అవసరాలకు కొంతైనా ఊరట లభిస్తుందని రైతులు ఆశిస్తున్నారు. అయితే, వర్షాల తీవ్రత, జలాశయాల్లోకి చేరే నీటి పరిమాణం తుపాను కదలికలు, వర్షపాతంపై ఆధారపడి ఉంటుంది. ప్రజలు, రైతులు వాతావరణ శాఖ సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలి.

# ఏనుమాములలో సీసీఐ కుట్ర

- రైతు నోట్లో మట్టి కొట్టే ప్లాన్!
- ధర పెంచి కొనే ఏజెంట్లపై బెదిరింపులు
- తెరవెనుక కోట్లకు ప్లాన్ వేసిన మిల్లర్లు



ఉత్తరం కాకతీయ

epaper.kakatiyanews.com | Date: 27 Oct, 2026 | Page: 1

సీసీఐ కోసం కోట్ల కుట్ర

రైతు ధరను తొక్కేసే ప్లాన్!

......(తరువాయి 2లో)

epaper.kakatiyanews.com | 27 Oct, 2026 | Page: 1 | Clip ID: C-082936

For more details, visit epaper.kakatiyanews.com

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** రైతుకు ఎక్కువ ధర ఇస్తే కడుపు మండుతున్న కొందరు జిన్నింగ్ మిల్లర్లు సీసీఐని అడ్డం పెట్టుకుని కోట్ల రూపాయలు కొల్లగొట్టేందుకు పక్కా ప్లాన్ వేశారు. ఇందులో భాగంగానే రైతుకు ఎక్కువ ధర ఇస్తున్న కమీషన్ ఏజెంట్లను బెదిరింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఏనుమాముల మార్కెట్ ను కుదిపేస్తున్నాయి. ఆసియాలోనే రెండో అతిపెద్ద పత్తి మార్కెట్ అయిన ఏనుమాములలో ఒక పెద్ద కుట్ర తెరవెనుక నడుస్తోంది. అసలు కథ ఏంటంటే.. మౌళి ఎంటర్ప్రైజెస్ చైర్మన్ చంద్రమౌళి, మహాలక్ష్మి ఎంటర్ప్రైజెస్, మా లక్ష్మి ఎంటర్ప్రైజెస్ వంటి కమీషన్ ఏజెంట్లు బయట రాష్ట్రాల వ్యాపారుల తరపున పత్తిని కొనుగోలు చేస్తున్నారు. వీరికి సొంత జిన్నింగ్ మిల్లులు లేవు. ఆర్డర్ పై రైతుకు రూ.100, 200 ఎక్కువ ఇచ్చి కొంటున్నారు. దీంతో రైతుకు కొంత ఊరట లభిస్తోంది. ఇదే కొందరు స్థానిక జిన్నింగ్ మిల్లర్లకు కంట్లో నలుసుగా మారింది. ఇటీవల చంద్రమౌళి లూజు పత్తి కొనుగోలు చేస్తుండగా నువ్వు లూజు పత్తి ఎందుకు కొంటావు? బస్తాలే కొనాలి అంటూ ఓ మిల్లర్ వర్గం లొల్లికి దిగింది. నిజానికి లైసెన్స్ ఉన్న కమీషన్ ఏజెంట్ ఏ రూపంలో ఉన్న పత్తినైనా కొనొచ్చు. కానీ కావాలనే గొడవ సృష్టించి భయపెట్టాలని చూస్తున్నారు.

**సీసీఐని రప్పించే ఎత్తుగడ.. ఇదే అసలు కుట్ర!**

ఎందుకు ఇలా చేస్తున్నారనే దాని వెనుక పెద్ద లెక్క ఉంది. మార్కెట్లో ధర ఎక్కువ ఉంటే సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) రాదు. ధర తక్కువ ఉంటేనే సీసీఐ వస్తుంది. సీసీఐ వచ్చి మద్దతు ధరకు కొనుగోలు మొదలుపెడితే, మార్కెట్ లో పత్తి ధర పడిపోతుంది. అప్పుడు మిల్లర్లు తక్కువ ధరకు కొని, సీసీఐ ద్వారా లేదా ఎగుమతుల ద్వారా కోట్ల లాభం పొందుతారు. అందుకే రైతుకు ఎక్కువ ధర ఇస్తున్న కమీషన్ ఏజెంట్లను మార్కెట్ నుంచి తరిమేస్తే, ధర ఆటోమేటిక్ గా తగ్గుతుందని వారి అంచనా. దీనికోసం కోట్ల రూపాయల ఫండ్ కూడా సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక్కడే అత్యంత విషాదం. ఇటీవల చిన్న మార్కెట్ అయిన భద్రాచలంలో క్వింటాల్ పత్తి రూ.10,600 పలుకగా, ఏనుమాములలో రూ.9,110 మాత్రమే పలికింది. అంటే రూ.1,500 తేడా. సోమవారం ఖమ్మం మార్కెట్ లో రూ.9,100 పలుకగా, పెద్ద మార్కెట్ అయిన ఏనుమాములలో రూ.8,950 మాత్రమే పలికింది. ఇలాంటి సమయంలో రైతు సంఘాలు ధర పెంచాలని పోరాడాలి. కానీ వారు ఎక్కువ ధర ఇస్తున్న వ్యాపారి దగ్గరకు వెళ్లి 100 గ్రాముల కాంటా తేడా అంటూ లొల్లి చేయడం వెనుక మిల్లర్ల హస్తం ఉందని రైతులే అనుమానిస్తున్నారు. ఎల్ నినో వల్ల ఎకరాకు 12 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి 5 క్వింటాళ్లకు పడిపోయి రైతు అప్పుల్లో ఉంటే, ఆదుకోవాల్సిన సంఘాలు వ్యాపారులకు వత్తాసు పలకడం దారుణం. ఒకప్పుడు రోజుకు లక్ష బస్తాలు వచ్చే ఏనుమాముల మార్కెట్ ఇప్పుడు అక్టోబర్ నెల మొత్తం కొడితే 50 వేల బస్తాలు కూడా రాలేదు. 550 మంది లైసెన్స్ దారులు ఉన్నా, కొందరి దోపిడీ వల్ల మార్కెట్ ఉనికికే ప్రమాదం వచ్చింది. ఇప్పటికైనా మార్కెట్ కమిటీ, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రైతుకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

**కాకతీయ కథనానికి స్పందన.. రంగంలోకి దిగిన మార్కెట్ సెక్రెటరీ**

కాకతీయలో కథనం ప్రచురితమైన వెంటనే మార్కెట్ పాలకవర్గం స్పందించింది. మార్కెట్ సెక్రెటరీ శ్రీనివాస్ మంగళవారం మౌళి ఎంటర్ప్రైజెస్ చైర్మన్ చంద్రమౌళి, మహాలక్ష్మి, మా లక్ష్మి ఎంటర్ప్రైజెస్ ప్రతినిధులను ఏనుమాముల మార్కెట్ కార్యాలయానికి పిలిపించారు. ధర పెంచి కొనడం తప్పుకాదు, రైతుకు మేలు చేసేవారికి మార్కెట్ కమిటీ అండగా ఉంటుంది. ఎవరైనా బెదిరించినా, అడ్డుకున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, అలా చేసిన వారి లైసెన్స్ రద్దు చేస్తామని సెక్రెటరీ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు గౌతమ్ కృష్ణ



**కాకతీయ, హన్మకొండ :** కమలాపురం మండలం గూడురు గ్రామానికి చెందిన తెప్ప స్వామి కుమారుడు తెప్ప గౌతమ్ కృష్ణ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ములుగులో నిర్వహించిన అండర్ 17 క్రికెట్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్టులో చోటు సంపాదించారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పాఠశాల క్రికెట్ పోటీల్లో గౌతమ్ కృష్ణ పాల్గొననున్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని జయభారతి కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**కాకతీయ, శంకరపట్నం:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో అతిథులు సూచించారు. శంకరపట్నం తెలంగాణ మోడల్ స్కూల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె. ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు సుందరగిరి సాయికిరణ్ గౌడ్, ప్రియాంక పాల్గొన్నారు. మత్తు పదార్థాలు ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవనంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో డా. మహేందర్ కట్కూరి, నాగమణి, ఉపాధ్యాయులు బొల్లం రాజు, సతీష్, వాసుదేవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ సార్ వారానికోసారి ఆస్పత్రికి

అదనంగా మూడు బాధ్యతల్లో సార్ తలమునకలు

ఆస్పత్రిలో వైద్యసేవలు నిల్.. అత్యవసర సేవలకు వస్తే అంతే గతి

నెలలుగా నిలిచిన అత్యవసర చికిత్సలు

మధ్యాహ్నం తర్వాత ఆస్పత్రంతా ఖాళీ.. కానరాని వైద్యులు

మొత్తం నర్సింగ్ స్టాఫ్‌పైనే భారమంతా..రాత్రి వేళల్లో ఒక రిద్దరుతోనే ఆస్పత్రి నిర్వహణ

అది కూడా జ్వరం గోళీలకే పరిమితమవుతున్న వైద్యం

ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని కార్మిక కుటుంబాల ఆవేదన

రోజుకు 100 మందికి ఔట్ పేషంట్లు వస్తున్నా మెరుగుపడని వైద్య సేవలు

కొత్త యంత్రాలున్నా పూర్తిస్థాయి వైద్యం అందడం లేదంటూ ఆవేదన

నాలుగు ఉమ్మడి జిల్లాల కార్మికులకు తప్పని అవస్థలు





# సార్ ఎక్కడ?!

## వరంగల్ ఈఎస్ఐ ఆస్పత్రిలో పర్యవేక్షణ గాలికి

### సార్‌కు అదనపు బాధ్యతలు.. పర్యవేక్షణ ఏదీ?




కాంతిసాగర్ నాచారం ఆస్పత్రిలో పీడియాట్రిక్ వైద్యుడిగా పనిచేస్తూనే వరంగల్ ప్రాంతీయ ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, స్టేట్ ఫ్యామిలీ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తున్నారు. ఈ బాధ్యతలన్నీ నిర్వహిస్తున్న ఆయన వరంగల్ ఆస్పత్రిలో అందుబాటులో ఉండటం లేదని, హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సూపరింటెండెంట్ ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో వైద్యుల విధుల నిర్వహణను పర్యవేక్షించేవారు కరువయ్యారు. ఉదయం రావాల్సిన వైద్యులు ఆలస్యంగా వస్తుండటంతో పాటు మధ్యాహ్నం తర్వాత ఆస్పత్రిలో దాదాపుగా డాక్టర్లెవరు అందుబాటులో ఉండటం లేదు. కాంతి సాగర్ ఏ రోజు ఆస్పత్రికి వస్తారు అనేది, ఆస్పత్రికి కేటాయిస్తున్న సమయంపై అధికారులకు సైతం స్పష్టత లేకుండా ఉండటం గమనార్హం. ఆస్పత్రిలో ఏడు వైద్యుల పోస్టులకు ఆరుగురు మాత్రమే పనిచేస్తుండగా, ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పిల్లల వైద్యం, గైనకాలజీ, ప్రసూతి, దంత వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ, వైద్యులు సకాలంలో అందుబాటులో లేకపోతే ఆ సేవల వల్ల తమకు ప్రయోజనం ఏమిటని రోగులు ప్రశ్నిస్తున్నారు. వైద్యుల ఖాళీలను భర్తీ చేయడంతోపాటు విధుల హాజరుపై పర్యవేక్షణ పెంచాలని కోరుతున్నారు.

“ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద దిక్కుగా ఉండాల్సిన వరంగల్ ఈఎస్ఐ ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్య సేవలు నామమాత్రంగా మారుతున్నాయి. వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో పాటు ఆస్పత్రి పర్యవేక్షణ కొరవడుతోంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ కాంతిసాగర్ రాష్ట్ర స్థాయిలో రెండు అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వరంగల్ ఆస్పత్రిలో వైద్యులపై పర్యవేక్షణ లేకుండా పోతోందన్న ఆరోపణలున్నాయి. సర్జికల్ వస్తువుల కొరత, రోగులకు ఆహార సరఫరాలో సమస్యలు, వైద్యుల విధుల సమయపాలనపై ఫిర్యాదులు ఆస్పత్రి పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. కొత్త ఎక్స్‌రే, ఈసీజీ యంత్రాలు ఉన్నప్పటికీ తమకు అవసరమైన వైద్యం సకాలంలో అందడం లేదని రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- కాకతీయ, వరంగల్

### నామ్‌కే వాస్తేగా వైద్య సేవలు

కార్మికులు, వారి కుటుంబాలకు వైద్య సేవలు అందించాల్సిన వరంగల్ ఈఎస్ఐ ఆస్పత్రి సమస్యలతో సతమతమవుతోంది. మందులు, రోగ నిర్ధారణ పరికరాలు, సిబ్బంది కొరతతో వైద్య సేవలు కుంటుపడుతున్నాయి. నెలలుగా అత్యవసర సేవలు నిలిచిపోయాయి. అత్యవసర చికిత్స అవసరమైన రోగులను హైదరాబాద్‌లోని ఈఎస్ఐ వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో కొందరు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల కార్మికులు, వారి కుటుంబాలకు ఈ ఆస్పత్రి సేవలందిస్తోంది. వరంగల్ నగరం విస్తరించడం, కొత్త పరిశ్రమలు ఏర్పడటంతో లబ్ధిదారుల సంఖ్య పెరుగుతున్నా అందుకు అనుగుణంగా వైద్య సదుపాయాలు మెరుగుపడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రికి రోజుకు సుమారు 100 మంది ఔట్‌పేషెంట్లు వస్తున్నప్పటికీ మందుల కొరత కారణంగా కొందరు బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఆస్పత్రిలో 30 మందికి పైగా నర్సింగ్ సిబ్బందితోపాటు 20 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నట్లు సమాచారం. అయినప్పటికీ వైద్య సేవల సమయపాలన, రోగుల నిరీక్షణ వంటి సమస్యలు ఎందుకు ఎదురవుతున్నాయనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బంది సంఖ్యను చూపించడం కాకుండా, వారు విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? రోగులకు అవసరమైన సమయంలో సేవలు అందిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాలని రోగులు కోరుతున్నారు. ఆస్పత్రిలో మందుల సరఫరాతోపాటు సర్జికల్ వస్తువుల లభ్యతపైనా రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన సర్జికల్ వస్తువులు అందుబాటులో లేకపోవడంతో చికిత్సలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. గత నాలుగైదు నెలలుగా అత్యవసర వస్తువుల కొనుగోలుకు సుమారు రూ.లక్ష నిధులను వినియోగిస్తున్నట్లు సమాచారం. టెండర్ ప్రక్రియ పూర్తయితే నెల రోజుల్లో సరఫరా మెరుగుపడుతుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొరత కారణంగా కొందరు రోగులు అనుమతి తీసుకుని ఆస్పత్రి నుంచి వెళ్లిపోతున్నారనే సమాచారం కూడా ఆందోళన కలిగిస్తోంది. అత్యవసర వైద్య సామగ్రి నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

### నాలుగు జిల్లాల కార్మికులకు తప్పని అవస్థలు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని కార్మికులకు వరంగల్ ఈఎస్ఐ ప్రాంతీయ ఆస్పత్రి కీలక వైద్య కేంద్రంగా ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఆస్పత్రిలో సాధారణ జ్వరం, జలుబు వంటి సమస్యలకు మందులు ఇవ్వడం మినహా పూర్తిస్థాయి వైద్యం అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యుల అందుబాటు, సూపరింటెండెంట్ పర్యవేక్షణ, ఖాళీ పోస్టుల భర్తీ, సర్జికల్ వస్తువుల సరఫరా, డైట్ నిర్వహణపై ఉన్నతాధికారులు సమగ్ర పరిశీలన జరపాలని రోగులు, కార్మికులు కోరుతున్నారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో సేవలు మెరుగుపడి, రోగులకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### డైట్ సరఫరాలోనూ సమస్యలే

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఆహారం అందించే డైట్ సరఫరాలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని తెలుస్తోంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మందులు, వైద్య సామగ్రితోపాటు పౌష్టికాహారం కూడా అవసరమేనని, సరఫరాలో జాప్యం లేకుండా చూడాలని రోగులు కోరుతున్నారు. ఆస్పత్రిలో కొత్త ఎక్స్‌రే, ఈసీజీ యంత్రాలతోపాటు ప్రయోగశాల పరీక్షలకు అవసరమైన పరికరాలు ఉన్నప్పటికీ, వాటి ద్వారా రోగులకు ఎంతమేర ప్రయోజనం కలుగుతోందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పరికరాల కొనుగోలుతోనే వైద్య సేవలు మెరుగుపడవని, వైద్యులు అందుబాటులో ఉండటం, అవసరమైన మందులు, సర్జికల్ వస్తువులు సరఫరా కావడం, పరీక్షల అనంతరం సకాలంలో చికిత్స అందడం కూడా ముఖ్యమని రోగులు అభిప్రాయపడుతున్నారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య విభాగాలు, పరికరాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావాలని కోరుతున్నారు.

## రైతుల ధాన్యం కష్టాలు పట్టించుకోరా?

- విత్తనాల కోసం సెల్ఫ్ డిక్లరేషన్‌పై సంతకాల ఒత్తిడి
- రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తా
- అమ్మాపురంలో ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**కాకతీయ, తొర్రూరు :** రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ ఇచ్చారు. అమ్మాపురంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని తొర్రూరుకు వెళ్తున్న ఆయన వాహనాన్ని రైతులు ఆపి తమ సమస్యలను వివరించారు. విత్తనాలు కొనుగోలు చేసేందుకు వెళ్లిన రైతులతో బలవంతంగా స్వీయ ప్రకటన పత్రాలపై సంతకాలు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ రైతులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కరోనా సమయంలో అమ్మాపురం గ్రామానికి కలెక్టర్‌ను పంపించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుల నుంచి స్వీయ ప్రకటనలు తీసుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కరెంటు కోతలు, సాగునీటి కొరతతో ఇప్పటికే పలువురు రైతులు నష్టపోయారని, పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ధాన్యం ధరల పెరుగుదలపై గొప్పలు చెప్పుకోవడం కాదని, రైతులకు వాస్తవంగా అందుతున్న ప్రయోజనాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విమర్శించారు.

## చందుర్తికి రూ.91.75 లక్షల నిధులు

- బాలికల విద్యాలయానికి రూ.58 లక్షలు
- తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.11.75 లక్షలు
- మహిళా సంఘాలకు మరో మూడు భవనాలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**కాకతీయ, చందుర్తి:** గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో మంగళవారం రూ.91.75 లక్షల విలువైన అభివృద్ధి పనులకు భూమిపూజలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. చందుర్తి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు భోజనశాల, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.58 లక్షలు మంజూరు చేయించినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సమీప బావుల నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని వాటర్ ట్యాంకులకు తరలించేందుకు జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.11.75 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాల భవన నిర్మాణానికి రూ.10 లక్షలతో భూమిపూజ నిర్వహించగా, సుమారు రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. మహిళా సంఘాలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, చందుర్తిలో మరో మూడు మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం స్థలాలను గుర్తించి తీర్మానాలు పంపాలని అధికారులకు సూచించారు.




## బల్దియాలో హార్టికల్చర్ మతలబు!

- రూ.47.75 లక్షల మొక్కల కొనుగోళ్లపై అనుమానాలు
- 267 పనులు.. టెండర్లు మాత్రం ముప్పై రెండే
- మిగిలిన 235 పనుల చెల్లింపులపై సందేహాలు
- ఆర్టీఐ దరఖాస్తుకూ బిల్లులు, ఒప్పందాల ప్రతులు ఇవ్వని అధికారులు
- 23 మంది శాశ్వత సిబ్బందికి 164 మంది ఔట్‌సోర్సింగ్
- ఆడిట్ జరిగిందంటూ నివేదికలు వెల్లడించకుండా నాటకీయత



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యానవన విభాగంలో నిధుల వినియోగం నుంచి మొక్కల కొనుగోళ్లు, పనుల నిర్వహణ, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకాల వరకు అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమాచార హక్కు చట్టం కింద కోరిన వివరాలకు అధికారులు ఇచ్చిన సమాధానం పూర్తి స్థాయి సమాచారాన్ని వెల్లడించకపోవడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. రూ.47.75 లక్షల మొక్కల కొనుగోలుకు సంబంధించిన బిల్లులు అందించకపోవడం, 267 పనులు చేపట్టినట్లు చెబుతూ కేవలం 32 పనులకే టెండర్లు పిలిచినట్లు పేర్కొనడం, ఆడిట్ జరిగినా నివేదికలు ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఉద్యానవన విభాగానికి 202324లో రూ.21.36 లక్షలు, 202425లో రూ.23.70 లక్షలు, 202526లో రూ.34.66 లక్షలు కేటాయించినట్లు పౌర సమాచార అధికారి, ఉద్యానవన అధికారి ఓ ఆర్టీఐ దరఖాస్తుకు ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు. మూడేళ్లలో బడ్జెట్ కేటాయింపులు గణనీయంగా పెరిగినా, వాస్తవంగా ఎంత ఖర్చు చేశారు? ఏ పనులకు ఎంత వెచ్చించారు? మిగిలిన నిధులెన్ని? అనే వివరాలు మాత్రం వెల్లడించకపోవడం గమనార్హం. కేటాయింపులకు, ఖర్చులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తెలుసుకునేందుకు అవసరమైన లెక్కలు ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**రూ.47.75 లక్షల కొనుగోలు.. లెక్కలేవీ?**

గత మూడేళ్లలో మొక్కల కొనుగోళ్ల వివరాలు కోరగా, 2024లో శ్రీదుర్గా ప్లాంట్స్ ఏజెన్సీ నుంచి రూ.47,75,509 విలువైన మొక్కలు కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే కొనుగోలుకు సంబంధించిన బిల్లుల ప్రతులు, టెండర్ వివరాలు, ఇతర సంస్థల నుంచి ధరలు సేకరించిన ఆధారాలు అందించకపోవడం గమనార్హం. ఒకే ఏజెన్సీ నుంచే కొనుగోళ్లు ఎందుకు జరిగాయి? పోటీ ధరలు పరిశీలించారా?




కొనుగోలు ప్రక్రియలో నిబంధనలు పాటించారా? అనే ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానాలు లేకపోవడం గమనార్హం. పత్రాలు బయటపెడితేనే కొనుగోళ్లలో పారదర్శకత ఎంతవరకు ఉందో తేలనుంది. గత మూడేళ్లలో ప్లాంటేషన్, మొక్కల నిర్వహణ, నర్సరీలకు సంబంధించి 267 పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే టెండర్లు పిలిచినవి 32 మాత్రమేనని సమాధానమిచ్చారు. మరి మిగిలిన 235 పనులను ఏ విధానంలో అప్పగించారు? వాటికి ఎవరు అనుమతులిచ్చారు? అంచనా వ్యయాలు ఎలా నిర్ణయించారు? పనులు పూర్తయినట్లు ఎవరు ధ్రువీకరించారు? చెల్లింపులు ఏ ప్రాతిపదికన చేశారు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వార్డుల వారీగా పనుల వివరాలు, అంచనా ప్రతులు, టెండర్ ఒప్పందాలు కోరినా అందించకపోవడం మరిన్ని సందేహాలకు కారణమవుతోంది. ఈ పనులకు సంబంధించిన పూర్తి రికార్డులు పరిశీలించినప్పుడే నిబంధనల అమలు, చెల్లింపుల తీరుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 164 మంది!**

ఉద్యానవన విభాగంలో 23 మంది శాశ్వత సిబ్బంది ఉండగా, 164 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. శాశ్వత సిబ్బందితో పోలిస్తే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సంఖ్య అధికంగా ఉండటంతో నియామకాలు, విధుల కేటాయింపు, హాజరు, వేతనాల చెల్లింపులపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీరి జీతభత్యాల వివరాలు కోరినా ఇవ్వలేదు. 164 మంది ఏయే ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు? ఒక్కొక్కరికి ఎంత వేతనం చెల్లిస్తున్నారు? హాజరును ఎవరు ధ్రువీకరిస్తున్నారు? అనే వివరాలు వెల్లడించాల్సి ఉంది. వేతనాల చెల్లింపులకు సంబంధించిన రికార్డులు బయటపెడితేనే ఈ వ్యవస్థలో పారదర్శకతపై స్పష్టత రానుంది.

**మొక్కలు నాటినట్టేనా.. బతికినట్టేనా?**

మొక్కలు నాటిన ప్రాంతాలు, వాటి సంరక్షణ, బతుకుదల శాతంపై వివరాలు కోరినా అధికారులు స్పష్టమైన గణాంకాలు ఇవ్వలేదు. ఒకే ప్రాంతంలో పదేపదే మొక్కలు నాటారా? నాటిన మొక్కల్లో ఎన్ని ప్రస్తుతం ఉన్నాయి? సంరక్షణకు ఎంత ఖర్చు చేశారు? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరమవుతున్నాయి. మొక్కలు నాటినట్లు రికార్డుల్లో చూపడమే కాకుండా, అవి బతికేలా చర్యలు తీసుకున్నారా లేదా అన్నదీ పరిశీలించాల్సిన అంశమే. వార్డుల వారీగా మొక్కల వివరాలు, క్షేత్రస్థాయి తనిఖీ నివేదికలు అందుబాటులోకి వస్తేనే పనుల ఫలితాలను అంచనా వేయవచ్చు.

**ఆడిట్ జరిగిందట.. నివేదికలు ఎక్కడ?**

గత మూడేళ్లలో ఖర్చులపై ఆడిట్ జరిగినట్లు అధికారులు పేర్కొన్నప్పటికీ, ఆడిట్ నివేదికల ప్రతులు, గుర్తించిన లోపాలు, బాధ్యులపై తీసుకున్న చర్యల వివరాలు అందించలేదు. ఫిర్యాదులు రాలేదని సమాధానమివ్వడం ఆర్థిక లావాదేవీలపై ఉన్న సందేహాలకు తెరదించదు. ఆర్టీఐ దరఖాస్తులో కోరిన బిల్లులు, ఒప్పందాలు, వార్డుల వారీ పనుల వివరాలు, ఆడిట్ నివేదికలు అందించకపోవడంపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బల్దియా ప్రత్యేక అధికారి చాహత్, కమిషనర్ వెంకన్న స్పందించి ఉద్యానవన విభాగం కొనుగోళ్లు, పనుల చెల్లింపులు, ఔట్‌సోర్సింగ్ నియామకాలపై సమగ్రంగా విచారణ జరిపి రికార్డులను బహిర్గతం చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. అవసరమైతే అవినీతి నిరోధక శాఖను ఆశ్రయిస్తామని ఫిర్యాదుదారులు హెచ్చరిస్తున్నారు.

## యాసంగిలో వరి సాగు వద్దు!

- వానాకాలం పంటను కాపాడాలి.. తాగునీటికి ముందస్తు చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

**కాకతీయ, ఖమ్మం బ్యూరో :** ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రస్తుత వానాకాలం పంటను కాపాడాలని, యాసంగిలో వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్‌లతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. యాసంగిలో సాగునీటి లభ్యత పరిమితంగా ఉండే అవకాశం ఉన్నందున పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని, విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. వచ్చే ఏడాది జూలై వరకు తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, లీకేజీలను అరికట్టి పాత తాగునీటి పథకాలను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇంకుడు గుంతలు, బోరు రీచార్జి గుంతలు, వ్యవసాయ కుంటల నిర్మాణం చేపట్టాలని, పశుగ్రాసం కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పత్తి, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, నీరు, విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఖమ్మం జిల్లాలో పది మండలాల్లో తీవ్ర కరువు, ఏడు మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులున్నాయని కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూగర్భ జలాలు 3.5 మీటర్లు తగ్గాయని కలెక్టర్ అంకిత్ వెల్లడించారు. సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ టీఎస్‌లో అశోక్‌కు కీలక బాధ్యత

- రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక
- 2002 నుంచి ఉపాధ్యాయ సంఘంలో క్రియాశీల సేవలు
- ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి : జమాండ్ల అశోక్



**కాకతీయ, వరంగల్ బ్యూరో:** పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జమాండ్ల అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నల్లగొండ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన ఎన్నికను ఖరారు చేశారు. 2002లో పీఆర్‌టీయూలో క్రియాశీల సభ్యత్వం పొందిన అశోక్ అప్పటి నుంచి సంఘంలో వివిధ హోదాల్లో సేవలందించారు. పలు మండలాల్లో కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించడంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా, ప్రస్తుత హనుమకొండ జిల్లాలోని ఆత్మకూరు మండల అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు పనిచేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శి బట్టాపురం మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్కిరెడ్డి మహేందర్, సురేందర్, వెంకన్నలకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరగనున్న నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## పెద్దవంగర పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్



**కాకతీయ, పెద్దవంగర:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పెద్దవంగర పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై ప్రమోద్ కుమార్ పోలీసుల విధులు, బాధ్యతలు, ఆయుధాలు, భద్రతా పరికరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, నేర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలను గుర్తుచేశారు. విద్యార్థులు చట్టాలను గౌరవించాలని, క్రమశిక్షణతో మెలగాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఈర్య నాయక్, అనిత, మహేందర్, ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యం



**కాకతీయ, చేర్యాల:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా జాతీయ మాల మహానాడు పనిచేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ అన్నారు. చేర్యాలలో సంఘం 20వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, సంఘం జెండాను ఆవిష్కరించారు. వర్గీకరణ వ్యతిరేక, తెలంగాణ ఉద్యమాలతో పాటు సామాజిక ఉద్యమాల్లో సంఘం చురుకుగా పాల్గొన్నదని, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజల హక్కులపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాం మలయ్య, కాటం సత్తయ్య, మేడిపల్లి నరసింహ, చింతల విజయ్‌కుమార్, శ్రీరాం వెంకటేష్, చంద్ర శ్రీకాంత్, పాకనటి భాస్కర్, పుట్ట రాజు, గుస్క వాసంతి, బుట్టి సాయికుమార్, గుస్క వెంకటేష్, మద్దూరి కనకయ్య, పుట్ట ఐలయ్య, బుట్టి శ్రీనివాస్, యనమల్ల యాదమ్మ, కాటం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



**కాకతీయ, నెల్లికుదురు:** విధుల నిర్వహణలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శబరీష్ సూచించారు. మంగళవారం నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి విధుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, సాంకేతిక వ్యవస్థల వినియోగంపై ఎస్సై కరుణాకర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, స్థానిక సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం, గుడుంబా తయారీ, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచి, అక్రమాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్థుల కదలికలను పర్యవేక్షిస్తూ, అవసరమైన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకుని ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని తెలిపారు.

## టిప్పర్ బ్యాటరీలు చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్



**కాకతీయ, ఆత్మకూరు:** టిప్పర్ లారీల బ్యాటరీలు చోరీ చేసిన వరంగల్ కాశీబుగ్గకు చెందిన ఐలుకుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఆత్మకూరు సీఐ బాబు లాల్ తెలిపారు. సోమవారం ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ గ్రామంలో నిలిపి ఉంచిన టిప్పర్ లారీల నుంచి బ్యాటరీలను ఐలు కుమార్ చోరీ చేసినట్లు పేర్కొన్నారు. వాటి విలువ సుమారు రూ.20 వేలుగా తెలిపారు. దొంగతనాలకు పాల్పడితే సహించేది లేదని, నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## దేశభక్తి, క్రమశిక్షణ అలవర్చుకోవాలి

- సీఐ డి. విశ్వేశ్వర్

**కాకతీయ, గీసుగొండ:** పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గంగదేవిపల్లి శివారులోని ఉషోదయ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. సీఐ డి. విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ విశ్వేశ్వర్ మాట్లాడుతూ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి షీల్డులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గీసుగొండ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# చరిత్ర.. ప్రకృతి.. ఉల్లాసం

- సింధుదుర్గ్‌లో మూడు రోజుల పాటు ఓరుగల్లు పరపతి సంఘం విహారయాత్ర
- ఛత్రపతి శివాజీ కోట, పురాతన ఆలయాల సందర్శన
- సభ్యుల సంక్షేమం, సంఘం ఆర్థిక అభివృద్ధిపై సర్వసభ్య సమావేశం



**కాకతీయ, వరంగల్ :** విజ్ఞానం, వినోదం, చారిత్రక విశేషాల మేళవింపుగా ఓరుగల్లు పరపతి సంఘం చేపట్టిన మూడు రోజుల మహారాష్ట్ర విహారయాత్ర మంగళవారం ఉత్సాహంగా ముగిసింది. గత ఆదివారం హైదరాబాద్ నుంచి విమానంలో సింధుదుర్గ్ చేరుకున్న సభ్యులు తర్కార్లి దేవ్‌బాగ్‌లో అరేబియా సముద్ర తీరాన ఉన్న రిసార్ట్‌లో బస చేశారు. ఆటపాటలతో సందడి చేస్తూ డీజేలో తెలంగాణ పాటలతో ఉత్సాహంగా గడిపారు. రెండో రోజు ఉదయం స్థానిక బీచ్‌లో సముద్ర స్నానాలు చేసిన అనంతరం దేవ్‌గఢ్‌కు బయలుదేరారు. కొంకణ్ తీరంలోని 900 ఏళ్ల పురాతన కుంకేశ్వర్ ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. సముద్ర తీరంలోని కొండపై మహాదేవుడు లింగరూపంలో కొలువుదీరిన ఆలయ విశేషాలను తెలుసుకున్నారు. అనంతరం దేవ్‌గఢ్ పార్కును సందర్శించి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఆ తర్వాత పడవల్లో అరేబియా సముద్రంలోని సింధుదుర్గ్ కోటను సందర్శించారు. మరాఠా చక్రవర్తి ఛత్రపతి శివాజీ 17వ శతాబ్దంలో నిర్మించిన ఈ కోటలోని దూద్ బావి, దహి బావి, శక్కర్ బావి, కోనేరు, శివరాజేశ్వర్ ఆలయం, భవానీమాత ఆలయంతో పాటు శివాజీ జెండాను వీక్షించారు. సముద్ర మార్గంలో పోర్చుగీసు, డచ్, బ్రిటిష్ దాడులను ఎదుర్కొనేందుకు నిర్మించిన కోట ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండటం సభ్యులను ఆకట్టుకుంది. అనంతరం రాజ్‌కోట్‌లోని 91 అడుగుల భారీ శివాజీ విగ్రహాన్ని సందర్శించి జై శివాజీ నినాదాలు చేశారు.

**రిసార్ట్‌లో సంఘం సర్వసభ్య సమావేశం**

మూడో రోజు మంగళవారం డైరెక్టర్ల నేతృత్వంలో తర్కార్లి దేవ్‌బాగ్‌లోని రిసార్ట్‌లో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యుల సంక్షేమం, సంఘం ఆర్థిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం సింధుదుర్గ్ పర్యటనకు ముగింపు పలికి విమానంలో బయలుదేరి మంగళవారం సాయంత్రం వరంగల్ చేరుకున్నారు. ఈ యాత్రలో డైరెక్టర్లు మందా శ్రీనివాస్, కత్తెరశాల వేణుగోపాల్, గాదె మధుసూదన్, ముష్కమల్ల సుధాకర్, పాలకుర్తి వేణుగోపాల్‌తో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు. వరంగల్ ప్రాంతానికి చెందిన ఓరుగల్లు పరపతి సంఘంలో అన్ని వర్గాల వారు సభ్యులుగా కొనసాగుతున్నారు. పొదుపు, రుణ వితరణ ద్వారా ఆర్థిక అవసరాలను తీర్చుకుంటూ, రెండేళ్లకోసారి విజ్ఞాన, విహారయాత్రలు నిర్వహిస్తున్నారు.

## వరంగల్ డీసీసీబీకి రూ.10.23 కోట్ల లాభం

- సహకార సంఘాలకు కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు
- సభ్య సంఘాలకు రూ.1.53 కోట్ల డివిడెండ్ ప్రకటన
- రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**కాకతీయ, వరంగల్ బ్యూరో:** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.10.23 కోట్ల నికర లాభాన్ని సాధించిందని హనుమకొండ జిల్లా కలెక్టర్, డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి తెలిపారు. ప్రతి సహకార సంఘానికి కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం హనుమకొండలో నిర్వహించిన డీసీసీబీ మహాజనసభలో బ్యాంకు ఆర్థిక పరిస్థితి, రుణాల మంజూరు, వసూళ్లు, సహకార సంఘాల బలోపేతంపై చర్చించారు. బ్యాంకు నికర లాభాల నుంచి సభ్య ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు రూ.1.53 కోట్ల డివిడెండ్ ప్రకటించారు. వార్షిక ఆర్థిక నివేదికలు, బ్యాలెన్స్ షీట్, లాభనష్టాల ఖాతా, ఆడిట్ ధ్రువీకరణ, ఆడిటర్ల నియామకం, లాభాల వినియోగం వంటి అంశాలను పరిశీలించారు. 50 శాతానికి పైగా రుణ వసూళ్లు సాధించిన అర్హతగల సంఘాలకు రూ.50 లక్షల వరకు, మిగిలిన ఏ, బీ కేటగిరీ ఆడిట్ ర్యాంకింగ్ సంఘాలకు రూ.30 లక్షల వరకు దీర్ఘకాలిక రుణాలు అందించే సదుపాయం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రుణ బకాయిదారులకు ఉపశమనం కల్పించే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని 2027 మార్చి 31 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. భూపాలపల్లి, ములుగు, ఘనపూర్ శాఖల భవన నిర్మాణాలకు స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందన్నారు. సహకార సంఘాల ఆర్థిక బలోపేతం, రుణ వసూళ్ల మెరుగుదల, రైతులకు మెరుగైన సేవలపై సమావేశంలో చర్చించారు. బ్యాంకు అనుబంధ గుర్తింపు అంశంపై సొసైటీల ప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నలకు అదనపు కలెక్టర్ ఎన్. రవి, పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీ సభ్యులు స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలిస్తామని తెలిపారు.

## ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి?

- రైతులు, మహిళలు, నిరుద్యోగులకు సమాధానం చెప్పాలి
- హామీల అమలుపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**కాకతీయ, తొర్రూరు :** ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పేద కుటుంబాలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం తొర్రూరు పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఆర్థిక సహాయం, పింఛన్ల పెంపు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, యువతకు ఉపాధి అవకాశాలపై ఇచ్చిన హామీల అమలు తీరును ప్రజలకు వివరించాలని కోరారు. పెరుగుతున్న సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు అండగా నిలవాలని, అర్హులైన రైతులందరికీ పథకాల ప్రయోజనాలు అందించాలని అన్నారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతివ్వాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి, అర్హులైన వారందరూ ఓటర్లుగా నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

## తమ్మిడిహెట్టి పేరుతో మోసం!

- నీళ్లపై అవగాహన లేకుండా ప్రాజెక్టులపై ప్రచారమా?
- మేడిగడ్డ సాకుతో వార్ధా ప్రాజెక్టును నిలిపేశారు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శలు




**కాకతీయ, తొర్రూరు :** తెలంగాణను కరువు ప్రాంతంగా మారుస్తూ సిగ్గులేకుండా ఫొటోలకు పోజులిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ఎలాంటి ఒప్పందాలు కుదరకముందే చర్చలు సఫలమయ్యాయని ప్రచారం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. చర్చలు నిజంగా సఫలమైతే ఎందుకు అధికారికంగా ప్రకటించలేదని నిలదీశారు. నీళ్లు, ప్రాజెక్టులపై కనీస అవగాహన లేకుండా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు మాట్లాడటం సిగ్గుచేటని తొర్రూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మూడు సార్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రితో తమ్మిడిహెట్టిపై సానుకూల చర్చలు జరిపారని ఎర్రబెల్లి తెలిపారు. బరాజ్ ఎత్తును 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలని కేసీఆర్ ప్రతిపాదించినప్పటికీ, మహారాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అది కార్యరూపం దాల్చలేదన్నారు. కేంద్ర జల సంఘం నివేదికల ఆధారంగా తమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత పరిమితంగా ఉన్నందునే కేసీఆర్ ముందుచూపుతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని పేర్కొన్నారు.

**వార్ధా ప్రాజెక్టును ఎందుకు ఆపారు?**

ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వార్ధా ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఎర్రబెల్లి చెప్పారు. మేడిగడ్డను సాకుగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం వార్ధా ప్రాజెక్టును నిలిపివేసిందని ఆరోపించారు. మేడిగడ్డను బాగుచేసి సాగునీరు అందించలేని ప్రభుత్వం పక్క రాష్ట్రాలకు వెళ్లి ఫొటోలకు పోజులిస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి పక్క రాష్ట్ర ముఖ్యమంత్రితో భేటీ కావడానికి మూడేళ్లు పట్టిందని అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలలోనూ తమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై కమిటీలు వేయడం తప్ప తెలంగాణకు ప్రయోజనం చేకూరలేదని వ్యాఖ్యానించారు. తమ్మిడిహెట్టి పేరుతో కాలయాపన చేయకుండా, ప్రచారాలు ఆపి తెలంగాణకు సాగునీరు అందించడంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు.

## డాక్టర్ రామకృష్ణకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

- ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించాలి
- గవర్నర్ కోటాలో అవకాశం కల్పించాలని తీర్మానం
- 60కిపైగా కుల, ప్రజా సంఘాల మద్దతు



**కాకతీయ, హనుమకొండ:** డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని 60కిపైగా కుల, ప్రజా సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన వైద్య, సామాజిక సేవలను గుర్తించాలని కోరారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి గౌడ్, ఉద్యమకారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్ రజక, పాస్టర్లు ఐసాక్, జోసెఫ్, బీసీ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్, సీజేపీ జెన్ని ప్రజ్వల్, న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ పటేల్, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ మాదిగ, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్, బావని రెడ్డి, టీడీపీ నాయకుడు నరేష్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ దాస్, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకుడు భిక్షపతి, గంగ నర్సయ్య, శివాజీ, సంధ్య రెడ్డి, కొమ్ముల బాబు, ఎండి అలీ, ఎం.ఆర్.ఓ. సమ్మయ్య, డాక్టర్ రాము, స్వామి, ప్రేమ్, మున్సిపాలిటీ శ్రవణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించారు.

## అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి

**కాకతీయ, రాయపర్తి:** రానున్న 2, 3 రోజుల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి గుమ్మడి వీరభద్రం సూచించారు. మంగళ, బుధ, గురువారాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రైతులు వరి కోతలను మరో 2, 3 రోజులు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోసిన ధాన్యాన్ని తార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలని కోరారు. వర్షాలు తగ్గి వాతావరణం అనుకూలించిన తర్వాతే కోతలు ప్రారంభించాలని సూచించారు.

## ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ పాత్ర కీలకం

- రానున్న రోజుల్లో కాంగ్రెస్ యూవతకు పెద్ద పీట
- నూతన గ్రామా యూత్ కమిటీ ఎన్నిక
- మండల అధ్యక్షుడు రేవూరి జలేందర్ రెడ్డి



**కాకతీయ,ఆత్మకూరు :** రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ యూవతకు పెద్ద పీట వేస్తుందని ఆత్మకూరు మండల అధ్యక్షుడు రేవూరి జెలందర్ రెడ్డి అన్నారు.మంగళవారం ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో మండల యూత్ అధ్యక్షుడు తనుగుల సందీప్ అధ్యక్షతన నూతన యూత్ కమిటీని ఎన్ను కోవడం జరిగింది.అనంతరం జెలేందర్ రెడ్డి మాట్లాడుతు రాబోయే రోజుల్లో యూత రాజకీయాల్లోకి రావాలని బిఆర్ఎస్,బీజేపీ చేస్తున్న అసత్యపు ప్రచారాలను తిప్పి కొట్టే విదంగా నూతన యూత్ కాంగ్రెస్ కమిటీ పనిచేయాలని తెలిపారు.కష్టపడ్డా ప్రతి కార్యకర్తలను పార్టీ గుండెల్లో పెట్టుకుంటుందని తెలిపారు.వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని గెలిపించాడానికి యూత్ నాయకులు కృషి చేయాలనీ యూత్ కాంగ్రెస్ నాయకులకు సూచించారు.ఆత్మకూరు గ్రామా యూత్ అధ్యక్షులుగా ఎల్లబోయిన శ్రీశైలం,కామారం గ్రామా యూత్ అధ్యక్షునిగా భరత్,తిరుమలగిరి అధ్యక్షునిగా తిరుపతి ఎన్నికయ్యారని తెలిపారు.ఈ కార్యక్రమలో ఆత్మకూరు గ్రామా సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు,గ్రామా పార్టీ అధ్యక్షుడు తాళ్ల కిరణ్,మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు,పిఏసియస్ డైరెక్టర్ అలువాల రవి,కాంగ్రెస్ మండల నాయకులు గుండెబోయిన శ్యామ్,వేణు తదితరులు పాల్గొన్నారు...

## రక్తదానం మహోన్నత సేవ

- దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**కాకతీయ, కరీంనగర్:** రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే మహోన్నత సేవ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కరీంనగర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సకాలంలో రక్తం అందించడం కీలకమని సీపీ పేర్కొన్నారు. కుల, మత, ప్రాంత, లింగ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విధి నిర్వహణలో 47 మంది పోలీసు సిబ్బంది ప్రాణత్యాగం చేశారని, వారి సేవలు చిరస్మరణీయమని తెలిపారు. అమరవీరుల కుటుంబాలను గౌరవించడం అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్, శ్రీనివాస్ జి., వెంకటస్వామి, విజయకుమార్, స్వామి, ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, వైద్య బృందం పాల్గొన్నారు. రక్తదాతలకు సీపీ కృతజ్ఞతలు తెలిపారు.

## దుగ్గొండిలో కలెక్టర్ పర్యటన

- విబిజీ రాంజీ ఉపాధి పనుల పరిశీలన
- కూలీల సంఖ్య పెంచాలని అధికారులకు ఆదేశాలు.



**కాకతీయ, దుగ్గొండి :** దుగ్గొండి గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల హాజరు సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే తుఫాన్ హెచ్చరికల నేపథ్యం లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.కలెక్టర్ పర్యటనలో జడ్పి సీఈఓ వసంత, స్థానిక సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ వాజిద్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. కలెక్టర్ పర్యటన నేపథ్యంలో స్థానిక ఎస్సై మాశిరెడ్డి మహేందర్ భద్రత ఏర్పాట్లు చేశారు.

## వైభవంగా నాగ సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య రథ శోభాయాత్ర...

- నాగ సుబ్రహ్మణ్యేశ్వరుడి నామ స్మరణతో మార్మోగిన ఊకల్ పుర వీధులు...



కాకతీయ,గీసుగొండ: ప్రసిద్ధి ప్రఖ్యాతిగాంచిన నాగసుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య రథ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. మండలంలోని ఊకల్ హవేలీ గ్రామంలోని శ్రీవల్లి దేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శన చార్యులు స్వామివారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవల్లి దేవసేన నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవరుల ఉత్సవ విగ్రహాలను మల్లెపూలతో అలంకరించిన అశ్వ రథం పై దివ్య రథ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మండల దీక్షలు చేపట్టిన స్వాములు, మహిళల కోలాటాల నడుమ గ్రామంలోని పురవీధులలో స్వామివారి రథోత్సవం కన్నుల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కక్కేర్ల సుభాష్,కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266